


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 362 సోమవారం 30-12-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..



## డ్రగ్స్ క్రయవిక్రయాలకు భయపడాల్సిందే!

మత్తుమందు దొరకని రాష్ట్రంగా తెలంగాణ
9.87% పెరిగిన క్రైమ్.. రికవరీలు అద్భుతం
పక్కా వ్యూహంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట
సొత్తును వెనక్కు తేవడంలో రాష్ట్రం టాప్
ఫోన్ ట్యాప్ కేసులో ఇంటర్‌పోల్ సాయం
'సంధ్య థియేటర్'పై విచారణ సాగుతోంది
వార్షిక నివేదిక విడుదలలో డీజీపీ జితేందర్

**హైదరాబాద్, డిసెంబరు 29:** "తెలంగాణలో డ్రగ్స్ అమ్మాలన్నా.. కొనాలన్నా భయపడేలా.. పట్టుబడితే శిక్ష తప్పదనేలా చర్యలు తీసుకుంటున్నాం. డ్రగ్స్ రహితంగా.. మత్తుమందు దొరకని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం" అని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది మొత్తం 1,942 డ్రగ్స్ కేసుల్లో 4,682 మందిని అరెస్టు చేశామని, రూ.142.95 కోట్ల విలువైన మత్తుపదార్థాలను సీజ్ చేశామని గుర్తుచేశారు. ఈ కేసుల్లో నిందితులకు చెందిన రూ.55.8 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదివారం ఆయన రాష్ట్ర వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మావోయిస్టుల కట్టడికి, సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. "సైబర్ నేరాల్లో డబ్బు పోగొట్టుకున్న వారికి రూ.180 కోట్ల మేర తిరిగి ఇప్పించాం. ఈ ఏడాది సైబర్ నేరాలకు సంబంధించి 25,184 ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది(17,571 ఫిర్యాదులు)తో పోలిస్తే.. సైబర్ నేరాల్లో 25.18% పెరుగుదల ఉంది. సైబర్ నేరాల్లో రికవరికీ సంబంధించి దేశంలోనే తెలంగాణ టాప్‌లో ఉంది" అని వ్యాఖ్యానించారు. మొత్తమ్మీద ఈ ఏడాది నేరాల్లో 9.87% పెరుగుదల ఉందన్నారు. "గత ఏడాది మొత్తం 2,13,121 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది వాటి సంఖ్య 2,34,158గా ఉంది. వీటిల్లో 1,55,639 కేసులను నవంబరు నెలాఖరులోగా పరిష్కరించాం. ప్రాసిక్యూషన్, పోలీసు శాఖ కలిసి పనిచేయడం వల్ల చాలా కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడం సాధ్యమైంది. వీటిల్లో మూడు మరణ శిక్షలు, 215 జీవిత ఖైదు శిక్షలున్నాయి. శిక్షలు పడ్డ వారిలో 35 మంది రౌడీషీటర్లున్నారు" అని వివరించారు.

**మహిళలపై నేరాలు**

మహిళలపై నేరాలు స్వల్పంగా పెరిగాయని డీజీపీ చెప్పారు. గత ఏడాది 19,013 కేసులు నమోదవ్వగా.. ఈ ఏడాది వాటి సంఖ్య 19,922కు పెరిగిందన్నారు. రాష్ట్రంలో మిస్సింగ్ కేసుల్లో 18% మేర తగ్గుదల నమోదైందని వివరించారు. "రాష్ట్రంలో పనిచేస్తున్న 27 భరోసా కేంద్రాలు గృహహింస, వరకట్న వేధింపులు, అత్యాచారం కేసుల్లో బాధితులకు అండగా ఉంటున్నాయి. ఈ ఏడాది షీటీమ్స్‌కు 10,862 ఫిర్యాదులు రాగా.. వాటిపై 830 కేసులు నమోదు చేశాం. మిగతా వాటిల్లో 3,329 పెటీ కేసులు. ఇతర కేసులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించాం. భరోసా కేంద్రాలకు 2,964 ఫిర్యాదులు వచ్చాయి. వీటిల్లో 1,974 పోక్సో కేసులు కాగా.. 574 అత్యాచారాలు, 436 ఇతర వేధింపులకు సంబంధించిన కేసులున్నాయి" అని వెల్లడించారు. రేప్, పోక్సో కేసులకు సంబం?ధించి బాధితులకు ప్రభుత్వం రూ.5.42కోట్ల మేర నష్టపరిహారం ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు.

**రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని జితేందర్ తెలిపారు. "గత ఏడాది 23,491 రోడ్డు ప్రమాద కేసులు నమోదవ్వగా.. ఈ వాటి సంఖ్య 20,702కు తగ్గాయి. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు కూడా 1.49% మేర తగ్గాయి. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 6,640మంది మరణించగా, ఈ ఏడాది 6,541మంది మరణాలు నమోదయ్యాయి. అత్యంత ఘోరమైన ప్రమాదాలు 2,336 నుంచి 1,018కి తగ్గాయి" అని వివరించారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్‌స్పాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి, ఇంజనీరింగ్ నిపుణులతో చర్చించి, తగు చర్యలు తీసుకోవడం ప్రమాదాల్లో తగ్గుదల సాధ్యమైందన్నారు. డీజీపీ వెల్లడించిన మరిన్ని ముఖ్యాంశాలు..

## ఆన్‌లైన్ సంస్థ మోసానికి కానిస్టేబుల్ బలి

25లక్షల అప్పు చేసి అందులో పెట్టుబడి
దగాపడి కుటుంబంతో సహా ఆత్మహత్యకు విఫలయత్నం
ఫలించక ఉరేసుకుని బలవన్మరణం




**సిద్దిపేట,డిసెంబరు 29:** అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలొస్తాయంటూ ఊరించిన ఓ ఆన్‌లైన్ ఫైనాన్స్ సంస్థను నమ్మిన కానిస్టేబుల్ రూ.25లక్షలు అప్పు చేసి అందులో పెట్టుబడులు పెట్టి మోసపోయారు. అప్పు తీర్చే మార్గం కనబడక మనస్తాపానికి గురై భార్య, పదేళ్లు కూడా దాటని ఇద్దరు కుమారులతో సహా ఆత్మహత్యకు విఫలయత్నం చేసి చివరకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన సిద్దిపేటలో ఆదివారం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన బండారి బాలకృష్ణ (34) సిద్దిపేటలో నివాసం ఉంటూ సిరిసిల్లలో 17వ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తక్కువ పెట్టుబడి పెడితే అధిక లాభాలొస్తాయంటూ ఊరించిన 'ఫోనిక్స్' అనే ఓ ఆన్‌లైన్ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థను నమ్మిన బాలకృష్ణ రూ.25లక్షల అప్పు చేసి అందులో పెట్టుబడి పెట్టి మోసపోయారు. దాంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆయన అప్పటి నుంచి ముభావంగా ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన ఆయన అప్పు తీర్చే మార్గం కనబడటం లేదు అందరం చనిపోదాం అని భార్య మానసను ఒప్పించారు. "అప్పు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నాం మా చావులకు ఎవరు కారణం కాదు" అని సూసైడ్ నోట్ రాసి పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న ఎలుకల మందును టీలో కలుపుకుని అందరూ తాగారు. ఎంతసేపటికీ చనిపోకపోవడంతో బాలకృష్ణ పక్కనే ఉన్న రూమ్‌లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య మానస విషయాన్ని వెంటనే తన బంధువులకు తెలపడంతో వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలకృష్ణను ఆయన భార్య, కుమారులను సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలకృష్ణ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మానసను, పిల్లలను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలి నుంచి సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

**నర్సాపూర్/కౌల్చారం, డిసెంబరు 29:** తాను పని చేసే పోలీసస్టేషన్ ఆవరణలోనే చెట్టుకు ఉరేసుకుని ఓ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడడం సంచలనం రేపింది. ఈ ఘటన మెదక్ జిల్లా కౌల్చారంలో జరిగింది. నర్సాపూర్‌లో నివాసముండే సాయికుమార్(50) కౌల్చారం పోలీసస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున విధుల్లో ఉన్న సాయికుమార్ పోలీసస్టేషన్ ఆవరణలో ఉన్న ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్సై గౌస్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దింపారు. కుటుంబీకులకు సమాచారమందించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సాయికుమార్ భార్య శైలజ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## ఆటో టైరు కింద నలిగి చిన్నారి మృతి


రంగారెడ్డి జిల్లా పడకల్ గ్రామంలో ఘటన



**తలకొండపల్లి, డిసెంబరు 29:** బోసి నవ్వులు.. చిట్టిపొట్టి మాటలతో అప్పటి దాకా అమ్మానాన్నలతో గడిపిన 11 నెలల చిన్నారి కానరాని లోకాలకు తరలిపోయి వారికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఆడుకుంటూ ఆటో కిందకు వెళ్లిన పాపను గమనించని డ్రైవర్ ముందుకు కదిలించడంతో టైరు కింద నలిగి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఆదివారం జరిగింది. మధ్యప్రదేశ్‌కు చెందిన పుష్పరాజ్ యాదవాసి కుటుంబంతో కలిసి కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం పడకల్‌కు వచ్చాడు.గ్రామానికి చెందిన ఓ రైతు డెయిరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పాల డబ్బాలను ఆటోలో లోడ్ చేస్తుండగా.. పుష్పరాజ్ 11 నెలల కూతురు ప్రియాన్సి ఆడుకుంటూ ఆటో కిందకు వెళ్లింది. గమనించని డ్రైవర్ ఆటోను ముందుకు కదిలించడంతో చిన్నారి టైరు కింద పడి తీవ్రంగా గాయపడింది. కడ్తాల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు చిన్నారిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పుష్పరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తెలంగాణలో నేరాల రేటు ఆందోళన కలిగిస్తోంది

– నేరాలు కాంగ్రెస్ సర్కార్ వైఫల్యానికి నిదర్శనం – పోలీసులే ప్రాణాలు తీసుకోవడం విచారకరం – మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, డిసెంబరు 29:** గత ఏడాదితో పోలిస్తే.. తెలంగాణలో నేరాలరేటు 22.5% పెరగడం ఆందోళనకరమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు పెరగడం బాధాకర మన్నారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఎక్స్‌లో పలు వ్యాఖ్యలు చేశారు. నేరాల సంఖ్య పెరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమన్నారు. "అత్యాచార కేసులు 28.9% పెరిగాయి. ఏడాదిలో 2,945 అత్యాచారం కేసులు నమోదయ్యాయి. అంటే.. రోజుకు సగటున 8 కేసులు. 82 శాతం అపహరణ కేసులు బాలికలకు సంబంధించినవి కావడం ఈ ప్రభుత్వానికి సిగ్గుచేటు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేదని ఈ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు. నాలుగు నెలల క్రితం అంబర్‌పేటలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ గంగారెడ్డి, ఆయన భార్య హత్య కేసు ఇంకా పరిష్కృతమ వ్వలేదని ఆరోపించారు. ఆర్నెల్ల క్రితం బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్య కేసులోనూ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. "163కు పైగా కీలక కేసుల్లో పరిష్కారమే లేదు. రూ.10 కోట్ల విలువైన ఆర్థిక నేరాల్లో రికవరీలు లేవు. నేరాల తీరును చూస్తుంటే బిహార్ వంటి రాష్ట్రాలతో తెలంగాణ పోటీపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హోంశాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి పాలనావైఫల్యానికి ఇది నిదర్శనం. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడానికి రేవంత్‌రెడ్డి కారణం" అని ఆరోపించారు. మరోవైపు.. సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేసేవారిని వేధింపులకు గురిచేస్తున్నారని, ఆఖరికి పేరు మరిచిపోతే కూడా కేసులు పెట్టి, హింసించడం దారుణమన్నారు. "రాష్ట్రంలో క్రైం రేటు ను తగ్గించడానికి బడ్జెట్‌ను విడుదల చేసి, పోలీసు శాఖను బలోపేతం చేయాలి. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన పోలీసులే.. వరుసగా బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. ములుగులో ఎస్సై, సిద్దిపేటలో కానిస్టేబుల్ కుటుంబం, కామారెడ్డిలో ఓ ఎస్సై, కానిస్టేబుల్, సిరిసిల్లలో కానిస్టేబుల్ కుటుంబం, మెదక్ జిల్లా కౌల్చారంలో హెడ్‌కానిస్టేబుల్.. ఇలా పోలీసులు ఆత్మహత్యలకు పాల్పడడం విచారకరం. ఈ ఆత్మహత్యలపై శాఖాపరమైన దర్యాప్తు చేయాలని డీజీపీని కోరుతున్నాం" అని విజ్ఞప్తి చేశారు.

**పిల్లలు ప్రాణాలతో ఉంటే చాలనుకుంటున్నారు**

"కాంగ్రెస్ పాలనలో చదువు సంగతి దేవుడెరుగు. తమ పిల్లలు ప్రాణాలతో బతికుంటే చాలని తల్లిదండ్రులు అనుకుంటున్నారు" అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురుకులాల దీనస్థితి చూస్తే.. బాసర సరస్వతీమాత మనసు తల్లడిల్లుతోందని ఎక్స్‌లో మరో ట్వీట్ చేశారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ కేజీబీవీలోని విద్యార్థు లు.. అక్కడ భోజనం తినలేం.. ఇంటికి తీసుకువెళ్లాలని.. తల్లిదండ్రులను వేడుకుంటున్నారన్నారు. అనంతపేట్ కేజీబీవీ పాఠశాలలో విషాహారం తిని పదిమంది విద్యార్థులు ఆస్పత్రి పాలైన దుస్థితి నెలకొందని గుర్తుచేశారు. వాంకిడి గురుకుల విద్యార్థిని విషాహారం తిని మరణించిన ఘటన మరువక ముందే.. ఇలాంటివి పునరావృతం కావడం సిగ్గుచేటన్నారు. "రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రి గా ఉండికూడా.. భావిభారత పౌరుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నావ్. మీ చేతగాని పాలన గురుకుల విద్యార్థుల పాలిట శాపంగా మారింది. తక్షణం స్పందించి, విద్యార్థుల ప్రాణాలను కాపాడే చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

## జగన్ 'పోరుబాట' రద్దు!

ఇటీవల రెండు నిరసనలకు ప్రజల స్పందన అంతంతే
సొంత కేడర్‌లోనే వ్యతిరేకత.. దీంతో రద్దు బాట

**అమరావతి :** జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారం విద్యుత్ చార్జీలు పెంచారు. విద్యార్థులకు బకాయిలు పెట్టారు. అధికారం పోయాక ఆ తప్పులను కూటమి ప్రభుత్వంపై వేస్తూ ఆందోళన బాటపట్టారు. వరుస పోరాటాలకు తేదీలను ప్రకటించిన జగన్... జనం నుంచి తగిన స్పందన రాకపోవడంతో వెనక్కి తగ్గారు. ఇటీవల రైతు పోరుబాట, విద్యుత్తు చార్జీలపై చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన కొరవడింది. దీంతో వచ్చే నెల 3న చేపట్టాలని నిర్ణయించిన 'ఫీజు రీయింబర్స్‌మెంటు' పోరుబాటను తాజాగా వాయిదా చేసుకున్నారు. అసలు విషయం చెప్పకుండా విద్యార్థుల పరీక్షల పేరిట వాయిదా వేస్తున్నట్టు కవరింగ్ ఇచ్చారు. అయితే నిరసన వాయిదా వేయడం కాదు రద్దు చేసుకున్నట్టేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. వైసీపీ చేపట్టిన నిరసనలకు ప్రజల నుంచి స్పందన రావడం లేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక కనీసం ఏడాదైనా గడువు ఇవ్వకుండా ప్రజాందోళనలకు పిలుపునివ్వడం ఏంటని వైసీపీ ముఖ్యనేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల క్రితం ఏర్పడిన ప్రభుత్వం మెడపై కత్తిపెట్టినట్లుగా ఆందోళనలు చేస్తామంటే ప్రజల్లో చులకన అవుతామని వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే రైతు పోరుబాట కార్యక్రమం విఫలమైందని, రైతులెవరూ వైసీపీ పిలుపునకు స్పందించలేదని చెబుతున్నారు.

మరోవైపు.. అధికారంలో ఉండగా విద్యుత్ చార్జీలను పెంచేసి, అధికారాన్ని కోల్పోయిన వెంటనే కరెంటు చార్జీలపై ఆందోళన నిర్వహించడాన్ని కూడా కొందరు వైసీపీ నాయకులు తప్పుబడుతున్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు బకాయిలు పెట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఆ విషయం మరిచిపోయి కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడం లేదంటూ మండలస్థాయిలో నిరసన కార్యక్రమానికి జగన్ పిలుపు ఇవ్వడాన్ని కూడా తప్పుపడుతున్నారు. వైసీపీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఇంకా పోలేదని సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాందోళనలు చేసేందుకు కేడర్ కూడా సహకరించడం లేదని చెబుతున్నారు. రైతు పోరుబాట, విద్యుత్ చార్జీలపై నిరసనలకు పట్టుమని పది జిల్లాల్లో కూడా చెప్పుకోదగ్గ కేడర్ పాల్గొనలేదని గుర్తు చేస్తున్నారు. మంత్రులుగా బాధ్యతలు నిర్వహించిన నేతలు కూడా నిరసన కార్యక్రమాలకు కనీసం వంద మందిని తీసుకురాలేక పోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మరో నిరసన కార్యక్రమమంటే ప్రజల్లో చులకనవుతామని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయాన్ని ఆ పార్టీ ముఖ్యనేతలు, కేడర్ ఆహ్వానించడం విశేషం.

## ఆదివాసి జాతికి ఉపయోగపడని

# "ఆదివాసి ఎమ్మెల్యేలు రాజీనామ చేయాలి"

**ఏజెన్సీ స్కూల్స్ టీచర్స్ సమయానికి స్కూల్స్ రావడం లేదు**

**డీడి పర్యవేక్షణ నిర్లక్ష్యం వలన చదువులు కుంటుపడుతున్నాయి**

**డీడి పై చర్యలు తీసుకోవాలి**

**జిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర డిమాండ్**



**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ డిసెంబర్ 29:**
ఆదివాసి ఓట్లతో గెలిచి ఆదివాసీలకు ఉపయోగపడని శాసనసభ్యులు రాజీనామా చేయాలని జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి దొర ఓ ప్రకటన లో తెలియ జేశారు వెంకటాపురం మండలంలోని కొమరం భీం ఆవరణంలో జి.ఎస్.పి ములుగు జిల్లా కమిటీ అత్యవసర సమావేశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్ అధ్యక్షతన సమావేశంఏర్పాటు చేశారు .ఈ సమావేశంలో జిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ ఆదివాసీల రిజర్వేషన్ తోని ఎమ్మెల్యేలుగా గెలుపొంది ఒక గిరిజనేతరుల కాళ్ల దగ్గర మోకరిల్లి జాతి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టడమే అన్నారు అని నిప్పులు చెరిగారు అసెంబ్లీలో కూడా ఆదివాసీ సమస్యలపై ఎప్పుడు నోరు విప్పకుండా కాలక్షేపం చేస్తున్నారని అన్నారు ఏజెన్సీ ప్రాంతంలో ఆశ్రమం పాఠశాలలు మరియు యుపిఎస్ పాఠశాలలో ఇంతవరకు ఉపాధ్యాయులు ఉన్నా కూడా లేనట్టుగే ఉన్నదని ఇలాంటి తరుణంలో ఆదివాసీలకు సమాధానం ఎవరు చెప్తారని ఆయన ప్రశ్నించారు.ఏజెన్సీ ప్రాంతంలో స్కూళ్ల టీచర్లపై ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ ఐ టి డి ఏ పరిధిలో ఉన్న పాఠశాల కూడా ఇంతవరకు కూడా డిడి పర్యవేక్షణ లోపం జరుగుతుందనిఅన్నారు అందుకే డిడి ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీలు ఉన్నది ఆదివాసి విద్యార్థులు కోసమేనని ఆయన గుర్తు చేశారు ఆశ్రమం పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన మెనోనూ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. ఆశ్రమం పాఠశాలలో ఐటిడిఎపిఓ స్వయంగా పర్యవేక్షించాలని ఆయన కోరారు. పర్యవేక్షణ లేకపోవడంతో ఆదివాసి విద్యార్థుల విద్య కుంటిబడుతున్నారని ఏజెన్సీలు ఉపాధ్యాయులు సమయం పాలన లేకుండా ఉంటున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రెగ గణేష్, పాయం కృష్ణ, వెంకటకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్టమస్ వేడుకలలో పాల్గొన్న ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే



**తొలి సమయం దంతాలపల్లి డిసెంబర్ 29**
సెమీ క్రిస్టమస్ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ డోర్నకల్ నియోజకవర్గంలోని దంతాలపల్లి, నర్సింహులపేట దైవజనులు మరియు క్రైస్తవ సోదరులు సోదరీమణులకు క్రిస్టమస్ సందర్భంగా.. .క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం కేక్ కట్ చేయటం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ ప్రేమ,దయా మరియు కరుణకు ప్రతీకగా ఉన్న క్రీస్తు జననం గూర్చిన సందేశాన్ని అందిస్తూ జరుపుకునే పండుగ క్రిస్మస్ అని పేర్కొన్నారు.అలాగే తెలంగాణ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన విందులో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండలాల తాసిల్దార్ లు,మండల పార్టీ అధ్యక్షుడు భట్టు నాయక్,జినుకుల రమేష్ నాయకులు,అనుబంధ విభాగాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి..**

**టీపీటీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్**




**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 29:**
గతంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ డిమాండ్ చేశారు జిల్లా కేంద్రం లోని టీపీటీ ఎఫ్ కార్యాలయం లో జరిగిన సమావేశంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్ ఎస్ ఎ ఉద్యోగులకు ప్రత్యామ్నాయం చూస్తాను అనే మాటలు వెనక్కు తీసుకోవాలి అన్నారు ఈ సమావేశంలో పాల్గొన్న టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చుంచు శ్రీశైలం, జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్, సీనియర్ నాయకులు సోమ విష్ణువర్ధన్, బి రాజు వివిధ మండలాల బాధ్యులు సజ్జనము విద్యాసాగర్, వై యాకయ్య, ఏ గోవర్ధన్, కోడెం శ్రీనివాస్, గోనె కార్తీక్, విఎండి రఫీక్, చెన్నూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా

# వి. అయోధ్య రామయ్య ఎంపిక




**తొలి సమయం వరంగల్, డిసెంబర్, 28:**
భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కరీంనగర్ కు చెందిన వి. అయోధ్య రామయ్య నియమితులయ్యారు. హనుమకొండ బాలసముద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలోయూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ ఈ మేరకు ప్రకటన చేశారు.మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన వేముల అయోధ్య రామయ్య గత 15 సంవత్సరాలుగా వివిధ దినపత్రికల్లో పని చేశారు. ఆయన సేవలను వినియోగించుకునేందుకు వీలుగా రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినట్లు తెలిపారు.డబ్ల్యుజేఐ రాష్ట్ర కార్యవర్గంలో తనకు చోటు కల్పించినందుకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తో పాటు ఉపాధ్యక్షులు కరుణాకర్, కార్యదర్శి ప్రమోద్ కుమార్ లకు సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



## ప్రమాద కరమైన

# మూలమడుపు

**దినదిన గండం ప్రాణగండం**

**దీని భాద్యులు ఎవరు!**



**తొలి సమయం తొర్రూరు డిసెంబర్ 29**
పెద్ద వంగర మండలం చిన్న వంగర గ్రామంలో ముత్యాలమ్మ గుడి వద్ద కల మూల మలుపు చాలా ప్రమాద కరంగా ఉంది. ప్రతి రోజు స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు,గ్రామ ప్రజలు రాకపోకలు సమయంలో మూలమడుగు ప్రమాదకరంగా ఉంది యాక్సిడెంట్ జరిగితే ప్రాణాలే పోవడం కాయం నిత్యం దిన దిన ప్రాణ గండం గా మారింది, కావున ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే సకాలంలో స్పందించి కల్వర్టు కొత్తగా నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడాలి అని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

## జనసేన పార్టీ

## తొలి జెండా గద్దె ఆవిష్కరణ



**తొర్రూరు తొలి సమయం డిసెంబర్ 29**
పెద్ద వంగర మండలం చిట్యాల గ్రామంలో మొదటి జెండా గద్దె మండల అధ్యక్షుడు దేశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో ఈరోజు జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జ్ వెల్తురి నగేష్ మరియు నియోజకవర్గ ముఖ్య సలహాదారులు పల్లెర్ల రమేష్ పస్తం లక్ష్మణ్ వడ్లూరి రజినీకాంత్ మరియు జనసేన పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు రేగురి సాయికిరణ్ గారు జక్కుల శంకర్ ప్రసాద్ గట్ల సతీష్ పెద్దవంగర మండల ముఖ్య సలహాదారులు మొగలగాని శ్రీనివాస్ జనసేన పార్టీ కార్యకర్తలు శంకర్ విగ్నేష్ దేశెట్టి వంశీ అభిమానులు అందరూ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నియోజకవర్గ ఇన్చార్జ్ వెల్తురు నగేష్ మాట్లాడుతూ రాబోయే రోజులలో పాలకుర్తి నియోజకవర్గం లో జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలను సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాలని ప్రతి ఒక్కరికి పిలుపునివ్వడం జరిగింది మరియు రానున్నటువంటి స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని గ్రామాలు సిద్ధంగా ఉండాలి అని అన్నరు

## వికాసతరంగిణి శాఖ

## వారిచే నగర సంకీర్తన

**తొలి సమయం తొర్రూర్ డిసెంబర్ 29**



తొర్రూరు పట్టణం లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి వికాస తరంగిణి తొర్రూర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పరమ పవిత్రమైన ధనుర్మాసం సందర్భంగా స్థానిక ప్రాతః కాలము లో నగర సంకీర్తన చేపట్టారు.ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల శ్రీకాంతా చార్యులు పూజా క్రతువులు నిర్వహించిన అనంతరం నగర సంకీర్త నను పట్టణ పురవీధులలో గోవింద నామాలతో ఏడుకొండలవాడా, ఆపద మ్రొక్కులవాడ అనాథ రక్షక, గోవింద,, గో విందా,, అంటూ భజన ను తన్మయత్వంతో పట్టణం లో గాంధీ సెంటర్, అన్నారం సెంటర్ మీదుగా గ్రామం లోని శివాలయం వద్ద, హరిపిరాల సెంటర్ వీదుల గుండా స్వామీ వారి చిత్ర పటంతో ఊరేగింపు నిర్వహించి దేవాలయం కు చేరుకొని కోలాటం తో భజనలు చేసారు.ప్రజలు ఆసక్తి గా తిలకించా రు ఈ కార్యక్రమంలో వికాస తరంగి ణి చీఫ్ కో ఆర్డినేటర్ కుందూరు గీతా రెడ్డి వికాస తరంగిణి సభ్యులు, గోవింద మాలధారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్ మెంట్ పై ఉద్యమిస్తాం...

**తక్షణమే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి**

**దీన్ దయాళ్ కోచింగ్ సెంటర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కేంద్ర మంత్రి సన్మానం**



**తొలి సమయం కరీంనగర్, డిసెంబర్, 29**

విద్యార్థుల 'ఫీజు రీయంబర్స్ మెంట్" మెత్తాన్ని సంక్రాంతి లోగా చెల్లించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన మాట మేరకు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎంపీ కార్యాలయంలో 'దీన్ దయాళ్' పేరిట తాను నిర్వహించిన కోచింగ్ సెంటర్ లో చదువుకుని ఉద్యోగాలు పొందిన పలువురు అభ్యర్థులను బండి సంజయ్ సన్మానించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు రాగుల నగేశ్ (జూనియర్ లెక్చరర్), అమర్ నాథ్ యాదవ్ (స్కూల్ అసిస్టెంట్), రాజశేఖర్, వెంకటేశ్ (సీఆర్పీఎఫ్), కార్తీక్, ప్రియాంక (గ్రూప్ 4) మాట్లాడుతూ "ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది మాతోసహా ప్రతి పేద విద్యార్థుల కల. డబ్బుల్లేక, కోచింగ్ తీసుకునే స్తోమత లేక ఆ కల నెరవేరుతుందో లేదోనని ఆందోళన చెందాం... అదే సమయంలో లోకసభ సభ్యులు బండి సంజయ్ మా కోసం ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసి ఉచిత భోజన, వసతి కల్పించారు. లక్షల వ్యయమయ్యే కోచింగ్ ను ఉచితంగా అందించారు. సొంత ఖర్చులతో వారు నిర్వహించిన ఉచిత కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందడం ద్వారా మేము ఈరోజు ఉద్యోగం సాధించగలిగాము.. అందుకు ఆయనకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. హైదరాబాద్ వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకునే స్థోమత లేని నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంవల్లే ఈరోజు పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం తనకు సంతోషాన్ని ఇచ్చిందని సంజయ్ ఈ సందర్భంగా అన్నారు.రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, బిశ్వాల్ కమిటీ 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ప్రకటించి 4 ఏళ్లయినా... వాటిని గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం భర్తీ చేయలేక పోయాయని ఆరోపించారు.అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చినకాంగ్రెస్ అధికారంలోకి రాగానే మాట తప్పిందని విమర్శించారు. రాష్ట్రంలో కేవలం 25 వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి, 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల నిరుద్యోగులు ఉద్యోగాలు రాని పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని 2022 అక్టోబర్ లో ప్రకటించిందని, ఇచ్చిన మాట మేరకు ఇప్పటి వరకు 9.25 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తామని చెప్పి మాట తప్పిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నిరుద్యోగ భృతి కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో నిరుద్యోగికి రూ.48 వేలు బకాయి పడిందన్నారు. వెంటనే ఆ బకాయిలన్నింటినీ చెల్లించాలని, తక్షణం 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని..లేనిపక్షంలో బీజేపీ పక్షాన ఆందోళనలు తప్పవన్నారు.ఫీజు రీయంబర్స్ మెంట్ అందక లక్షలాది మంది విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని, బకాయిల భారం మోయలేక యాజమాన్యాలు కాలేజీలు మూసుకునే దుస్థితి దాపురించిందన్నారు.ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజులు కట్టాలని ఒత్తిడి తెస్తున్నాయన్నారు. ఫలితంగా ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నరని తెలిపారు. ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి టెండర్లను ఆహ్వానించిన నరేంద్రమోదీ ప్రభుత్వానికి సంజయ్ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు కేంద్రం ఇచ్చిన సంక్రాంతి కానుకగా ఆయన అభివర్ణించారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి దాదాపు రూ.18 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారని ఆ మొత్తాన్ని కేంద్రం భరించేందుకు సిద్దంగా ఉందని చెప్పారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై కాంగ్రెస్ రాజకీయం చేయడం సిగ్గు చేటని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న పదేళ్లు సూపర్ ప్రధానిగా సోనియాగాంధీ కొనసాగుతూ ఆయనను రబ్బర్ స్టాంప్ గా మార్చిన విషయాన్ని కాంగ్రెస్ మరిచిపోయినట్టుంద న్నారు. ప్రధానిగా మన్మోహన్ ప్రభుత్వం ప్రజాప్రతినిధ్యం చట్టంలోని నిబంధనలను సవరిస్తూ ఆర్డినెన్స్ తీసుకొస్తే..ఆ ఆర్డినెన్స్ కాపీలను రాహుల్ గాంధీ చింపివేసి ఆయనను దారుణంగా అవమానించింది వాస్తవం కాదా అన్నారు. కానీ బిజెపి ప్రభుత్వం దేశానికి మన్మోహన్ సింగ్ అందించిన సేవలను గుర్తించి అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించడమే కాకుండా, ఆయనకు ఢిల్లీలోనే స్మారక స్థల్ నిర్మించేందుకు సిద్ధమైందన్నారు. గతంలో ప్రధానిగా పనిచేసిన పీవీ నర్సింహరావు మరణించిన సమయంలో ఆయన అంత్యక్రియలు ఢిల్లీలో నిర్వహించకుండా అవమానించిన కాంగ్రెస్ నేతలకు మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత లేదన్నారు.

# పెరిగిన ధరలు.. ద్రవ్యోల్బణం కట్టడికి మార్గాలేవీ




**న్యూఢిల్లీ :** దేశంలో ఆహార పదార్థాల ధరలు మిగతా నిత్యావసరాల ధరలకన్నా అధికంగా పెరుగుతు న్నాయి. ఈ ఏడాది జులైలో అన్ని వస్తువుల ద్రవ్యోల్బణం మొత్తంగా 7.44 శాతం ఉంది. ఆహారధాన్యాలు, కాయగూరలు, పాల ఉత్పత్తులు, తదితర ఆహార పదార్థాల ధరల ద్రవ్యోల్బణం విడిగా చూస్తే 11.5 శాతం ఉంది. టమాటా వంటి కొన్నింటి ధరలు అసాధారణంగా పెరిగినందువలన వాటిని అధికంగా సరఫరా చేసేవిధంగా కొన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంది. దాని వలన ఆగస్టులో ఈ ద్రవ్యోల్బణం 10 శాతానికి చేరువలోకి వచ్చింది. మొత్తం ద్రవ్యోల్బణం కూడా 6.83 శాతానికి తగ్గింది. అయినప్పటికీ వినిమయ వస్తువుల ధరల పెరుగు దల, అందునా ఆహార ధరల పెరుగుదల ఇంకా ఒక తీవ్ర సమస్యగానే ఉంది. ఆహార ధరలు ఇలా వేగం గా పెరిగిపోతూ వుండడం అనేది కేవలం భారత దేశ సమస్యగా మాత్రమే లేదు. మూడవ ప్రపంచ దేశాలన్నింటితోబాటు సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో సైతం ఇది సమస్యగానే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా తలెత్తిన ధోరణి ఇది. మామూలుగా అందరూ దీనికి ఉక్రెయిన్ యుద్ధం కారణం అంటున్నారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా కొరత ఏర్పడిన మాట వాస్తవమే. కాని, ఇప్పుడు మనం చూస్తున్న ద్రవ్యోల్బణం యుద్ధం వలన వచ్చిన కొరత కన్నా, కొరత ఏర్పడబోతోందన్న ముందస్తు అంచనా ఫలితంగా వచ్చింది. యుద్ధం వచ్చిన తర్వాత వాస్తవంగా ఆహార ధాన్యాల సరఫరాలో కొరత ఇంకా ఏర్పడక ముందే ప్రపంచంలో ఆహార ధాన్యాల వ్యాపారంలో లాభాల రేటు చాలా దేశాల్లో పెరిగింది. ఇందుకు అనేక దాఖలాలు ఉన్నాయి. దీనిని బట్టి రాబోతున్న ఆహారధా న్యాల కొరతను దృష్టిలో ఉంచుకుని గుత్త వ్యాపార సంస్థలు ముందుగానే వాటి ధరలను పెంచేశారని స్పష్టమవుతోంది. మన దేశంలో కూడా ఇదే జరిగింది. అందుకే చాలామంది 'ద్రవ్యోల్బణం మీద ముందస్తు అంచనాలు' ధరల పెరుగుదలకు దోహదం చేశాయని అంటున్నారు. ఆహారధాన్యాల ధరలను నియంత్రించడానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది, ప్రభుత్వం ద్రవ్య విధానాన్ని తగువిధంగా మార్పు చేయడం. ఇందులో వడ్డీ రేట్లను పెంచడం, రుణ లభ్యతను అదుపు చేయడం అనే రెండు చర్యలు ఉంటాయి. పాత రోజుల్లో ఇటువంటి సందర్భాలలో ఆహారధాన్య వ్యాపారులకు మాత్రమే రుణ లభ్యతను అదుపు చేసేవారు. దాని ఫలితంగా వారు ఎక్కువ నిల్వలను ఉంచుకోవడం సాధ్యపడేది కాదు. అప్పుడు ఆహారధాన్యాల ధరలు తగ్గేవి. కాని ప్రస్తుత నయా ఉదారవాద కాలంలో కొన్ని తరగతుల వ్యాపారులకు మాత్రమే నియంత్రణ అమలు చేయడం సాధ్యం కాదు. అందుచేత అందరికీ రుణ లభ్యతను అదుపు చేయాల్సి వుంటుంది. దీని వలన చిన్న, మధ్య తరహా పెట్టుబడిదారులు ఎక్కువగా దెబ్బ తింటారు. అది నిరుద్యోగం మరింత పెరగడానికి దారి తీస్తుంది. దాని వలన ప్రజల కొనుగోలు శక్తి మొత్తం మీద చూసినప్పుడు తగ్గిపోతుంది. అంటే ఆహారధాన్యాలకు డిమాండ్ తగ్గుతుంది. దానివలన ద్రవ్యోల్బణం తగ్గుతుంది. నయా ఉదారవాదం ద్రవ్యోల్బణానికి చూపించే పరిష్కారం ఇదే. రెండో పద్ధతి ఏమిటంటే, ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించడం. అప్పుడు ప్రభుత్వం దగ్గరున్న నిల్వలు బహిరంగ మార్కెట్ లోకి కాకుండా నేరుగా ప్రజలకు చేరుతాయి. అప్పుడు నిల్వలు స్పెక్యులేటర్లకు అందుబాటులోకి లేకుండా పోతాయి. వినియోగదారులు బహిరంగ మార్కెట్ నుండి ప్రజా పంపిణీ వ్యవస్థ వైపు మరలుతారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించి ఎక్కువ ఆహారధాన్యాలను ప్రజలకు అందించాలంటే అప్పుడు ప్రభుత్వం ఎఫ్‌సిఐ ద్వారా మరింత ఎక్కువగా ఆహారధాన్యాల సేకరణకు పూనుకోవలసి వస్తుంది. ఈ ఏడాది ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో 5 కోట్ల 21 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించాలని నిర్ణయించింది. ఈ పని చేస్తే తప్ప ప్రస్తుత ఆహారధా న్యాల ధరల పెరుగుదలను నియంత్రిం చడం సాధ్యం కాదు. ఎంతో అపఖ్యాతిని ఆర్జించిన నల్ల వ్యవసాయ చట్టాలు ఎంత పనికిమాలినవో ఇప్పుడు బాగా బోధపడుతుంది. రైతులంతా ఉద్యమించి ఆ చట్టాలను రద్దు చేసేవరకూ పోరాడారు గనుక సరిపోయింది. అలా కాకుండా, ఆ చట్టాలే అమలులో ఉండిన్లటైతే మొత్తం దేశంలోని ఆహార ధాన్యాలన్నీ ప్రైవేటు రంగం గుప్పెట్లో ఇరుక్కుపోయి వుండేవి.

### డీ లిమిటేషన్ అన్యాయాలపై

# చర్చ మొదలవ్వాలి !

దేశ జనాభాకు అనుగుణంగా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు ఎప్పుడో



పెరగాల్సి ఉంది. కానీ ఈ సీట్లు పెరగడం లేదు. సరికదా కేంద్రంలో పాలన చేసిన పార్టీలన్నీ కాలయాపన చేస్తూ వచ్చాయి. సీట్లు పెరిగితే తమకు ఎక్కడ ముప్పు వస్తుందో అన్న ఆలోచనలో పాలక పార్టీలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన కత్తి మీద సాములాంటిది. ఇది ఎన్నో కీలక రాజకీయ పరిణామాలకు దారి తీసే అవకాశం ఉంది. దీనికితోడు జనాభా కూడా పాపం పెరిగినట్లు పెరుగుతోంది. జనాభా కంట్రోల్ చేయడంలో కొన్ని రాష్ట్రాలు బాగా కృషి చేస్తుంటే..బీహార్, బెంగాల్ వంటి రాష్ట్రాలు అస్సలు పట్టించుకోవడం లేదు. అంతెందుకు గణాంకాల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. దక్షిణాదిలో జనాభా నియంత్రణ కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. ఈ క్రమంలో అక్కడ డీలిమిటేషన్ జరిగితే అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఇతర రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో కృషి చేస్తున్న తమకు అన్యాయం జరిగేలా ఉందని ఇటీవల తెలంగాణ మంత్రి కెటిఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాకుండా దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పంపిణీలో అన్యాయం జరుగుతుందని కూడా అన్నారు. నిజంగానే ఇది ఆలోచించాల్సిన విషయం. కేరళ లాంటి రాష్ట్రాలు అక్షరాస్యత,జనాభా నియంత్రణలో ముందున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే దేశ జనాభా 140 కోట్లకు చేరినందున వారికి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించే వారి సంఖ్య కూడా పెరగాలని కోరుకుంటున్నారు. అందుకే జనాభా ప్రాతిపదికన విభజించి 846 నియోజకవర్గాలు చేయాలన్న ఆలోచన ఉంది. అలా చేస్తే.. ఒక్క యూపీకే 143 లోక్ సభ సీట్లు వస్తాయి. మొత్తం దక్షిణాదికి 160 వరకూలోక్ సభ సీట్లు ఉంటాయి. అంటే... మొత్తం దక్షిణాది అంతాకూడా యూపీతో పోటీపడదన్న మాట. దీంతో పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోవడం ఖాయం అన్న ఆందోళన మరోవైపు వెన్నాడుతోంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు నియోజకవర్గాల పునర్వి భజనకు జనాభాను ప్రాతిపదికగా తీసుకోకూడదని డిమాండ్ చేస్తున్నాయి. దేశంలో జనాభాను నియంత్రిం చడంలోనే కాకుండా మానవ అభివృద్ధి సూచికల్లో కూడా దక్షిణాది రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. జనాభా లెక్కల ఆధారంగా చేసే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కత్తి దక్షిణాది రాష్ట్రాలపై వేలాడుతోంది. మహిళా రిజర్వేషన్‌బిల్లు ఆమోదించిన తరువాత జరిగే తొలి జనగణన తరువాత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి.. మహిళా రిజర్వేషన్‌లను అమలు జరుపుతామని లోక్‌సభలో కేంద్రం ప్రకటించింది. దీంతో.. మళ్లీ నియోజక వర్గాల పునర్విభజన అంశం తెరమీదకు వచ్చింది. జనాభానే ప్రాతిపదికగా తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని ఇప్పటికే అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఎంపీ స్థానాలకు 1971 నాటి జనగణన ప్రాతిపదిక. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు ప్రస్తుతం 129 లోక్‌సభ స్థానాలున్నాయి. జనాభా లెక్కలు తీసిన తర్వాత పునర్విభజనలో వీటి సంఖ్య 103కు పడిపోతుంది. ఉత్తరాదిలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య పెరుగుతుంది. ప్రస్తుతం ఈ నాలుగు రాష్ట్రాల్లోని లోక్‌సభ స్థానాల సంఖ్య 174 కాగా పునర్విభజనతో వీటి సంఖ్య ఏకంగా 204 స్థానాలకు చేరుకుంటుంది. పశ్చిమబెంగాల్, ఒడిషా కూడా భారీగా నష్టపోతాయి. ప్రసుతం ఈ రెండు రాష్ట్రాలకు కలిపి 42 లోక్‌సభ స్థానాలుంటే.. కొత్తగా జరిగే పునర్విభజన తరువాత వాటి సంఖ్య 34కు పడిపోయే అవకాశం ఉంది. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు జరిపినందుకు దక్షిణాది రాష్ట్రాలు దారుణంగా నష్టపోతుండగా.. జనాభా నియంత్రణలో పూర్తిగా విఫల మై.. జనభా విస్ఫోటంతో నానా అవస్థలు పడుతున్న ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం లబ్ధి పొందడం దారుణం కాకా మరోటి కాదు. ఇదే విషయాన్ని కెటిఆర్ లెక్కలతో సహా విరించి..జరుగబోతున్న నష్టాన్ని ప్రజల ముందుంచారు. దక్షిణాది రాష్ట్రాల నేతలు కూడా ఇదే విషయంపై మండిపడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజ నకు కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకూడదని ఈ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేటీఆర్ కూడా ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకే నియోజకవర్గాల పునర్విభజ నలో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని హామీ ఇవ్వాలంటూ తమిళనాడు సిఎం స్టాలిన్ ప్రధాని మోడీని డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల బిల్లును తీసుకు వచ్చిన సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన తరవాత అమలు చేయడం అని అందులో షరతు పెట్టింది. దీంతో ఈ నియోజకవర్గాల పునర్విభజన తెరపైకి వచ్చింది. ఇదే జరిగితే దక్షిణాది పరిస్థితి ఏమిటన్నదానిపై చర్చలు ప్రారంభమయ్యాయి. దేశంలో జనాభా పెరిగిపోతోందని జనాభా నియంత్రణను మన ప్రభుత్వాలు చేపట్టాయి. జనాభాను నియంత్రించిన వారికి ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు మెరుగ్గా ఉన్నాయి. ప్రజలు చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఫలితంగా దక్షిణాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గింది. అభివృద్ధిలో ముందుకు వెళ్లింది. కానీ ఉత్తరాదిలో జనాభా పెరుగుదల నిష్పత్తి తగ్గలేదు... అక్కడి ప్రజలు జనాభా నియంత్రణ పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు జనాభా ప్రకారం డీలిమిటేషన్ జరిగితే.. నష్టపోయేది దక్షిణాది. లాభపడేది ఉత్తరాది. ఈ అన్యాయన్ని ఎలా సరిచేస్తారన్నదే ఇప్పుడు దేశం ముందున్న ప్రశ్న.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101